
సాక్షి తూర్పుగోదావరి

గురువారం | 1 | జూన్ | 2023



మిగులు జలాలు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 10.637 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.80 అడుగులకు నీటిమట్టం చేరింది.



పథకం ప్రకారమే హిజ్రా హత్య

ధవళేశ్వరానికి చెందిన హిజ్రా మరపట్ల ఆనంద్ అనే ఆనందినిని తన ముగ్గురు స్నేహితులే పథకం ప్రకారం హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 41.0°/27.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	41.0	27.0
కాకినాడ	38.4	25.6
అమలాపురం	38.5	26.7

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తిని కలసిన కలెక్టర్, ఎస్పీ



హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ ఆకుల వెంకటసాయిని కలసిన కలెక్టర్, ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ ఆకుల వెంకట శేషసాయిని కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖపట్నం పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరంలో స్వల్ప విరామం కోసం ఆగిన ఆయనను వారు కలుసుకున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విడిది గృహంలో కలెక్టర్, ఎస్పీలు కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 2.32 కోట్లు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గడచిన 20 రోజులకు నగదు రూపేణా స్వామివారికి రూ. 2,32,56,651 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 442 గ్రాముల బంగారం, 6.572 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయన్నారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యురాలు అచంట అనసూయ, సురేష్ దంపతులు పాల్గొన్నారు.

రేపట్నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో శుక్రవారం నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు రెగ్యులర్‌గా 6,667 మంది, ప్రైవేటుగా 2,806 మంది హాజరవుతున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు ఈవిషయం తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహంతో కలిసి సమన్వయ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందు తప్పనిసరిగా విద్యార్థులు హాజరవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 25 కేంద్రాలు, కొవ్వూరు డివిజన్‌లో 19 కేంద్రాలలో సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. మున్సిపల్, మండల పరిధిలోని ప్రధాన కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామని డీఈవో పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డా.బిఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల పరిశీలనకు 151మంది హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్,పాలిసెట్ కన్వీనర్ వి.నాగేశ్వరరావు ఈ విషయం తెలిపారు. గురువారం 43,001 నుంచి 58,000 ర్యాంకు వరకు గల విద్యార్థులు సర్టిఫికెట్లు పరిశీలనకు హాజరు కావాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సులను ఎంపిక చేసేందుకు గురువారం నుంచి 6వ తేదీ వరకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

కన్నుల పండువగా.. పట్టాహాసంగా..



ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

- ఘనంగా జేఎన్‌టీయూకే స్నాతకోత్సవం
- కులపతి హోదాలో హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్
- బంగారు పతకాలు, డాక్టరేట్లు, పట్టాల ప్రదానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడలోని జేఎన్‌టీయూలో బుధవారం తొమ్మిదో స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. అతిరథ మహారథుల మధ్య విద్యా వేడుకను కనుల పండువగా నిర్వహించారు. 14 సంవత్సరాల చరిత్ర గల జేఎన్‌టీయూ కాకినాడ ప్రాంగణం ఇందుకు వేదికగా నిలిచింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. దీంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. వర్సిటీ ఏడో స్నాతకోత్సవానికి గత గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ హాజరయ్యారు. తాజాగా జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమానికి ప్రస్తుత గవర్నర్ అబ్దుల్ నజీర్ కులపతి హోదాలో పాల్గొన్నారు. ఉదయం నుంచి వర్సిటీలో పతకాలు అందుకోవడానికి వచ్చిన విద్యార్థులు..వారి తల్లిదండ్రులతో సందడి నెలకొంది.

ప్రగతి వివరించిన వీసీ

బంగారు పతకాలు, పీహెచ్‌డీలు స్వీకరించేందుకు విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో ఆడిటోరియంలో అడుగుపెట్టారు. ప్రాంగణమంతా కలియతిరుగుతూ కనిపించారు. కాన్వొకేషను హాలులో ఉత్సాహం వెల్లివిరిసింది. తొలుత పతకాలు, పట్టాల గ్రహీతలతో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ప్రసాదరాజు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గవర్నర్ అనుమతితో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీసీ ప్రసాదరాజు తన ప్రసంగంలో వర్సిటీ సాధించిన ప్రగతిని వివరించారు. చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త గ్రీన్ కో మేనేజింగ్ డైరెక్టర్ చలమలశెట్టి అనిల్‌కు గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందజేశారు.



పరిశోధన విద్యార్థికి డాక్టరేట్ అందిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో వీసీ ప్రసాదరాజు, శాంత బయోటెక్ చైర్మన్ వరప్రసాదరెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, యూనివర్సిటీ అధికారులు

సమాజానికి తిరిగి ఇవ్వాలి

దాదాపు 20 నిముషాల పాటు గవర్నర్ ప్రసంగించారు. వివిధ అంశాలను ప్రస్తావిస్తూ ప్రేరణ కలిగించేలా ప్రసంగం సాగింది. అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా జేఎన్‌టీయూ కాకినాడ స్థిరపడిందన్నారు. ఇటీవలే న్యాక్ ఏప్లస్ గుర్తింపు పొంది మరింత ఖ్యాతి సాధించిందని కొనియాడారు. గ్రాడ్యుయేషన్ డే అంటే యూనివర్సిటీతో సంబంధం ముగించడం కాదన్నారు. ఇంటర్నల్ స్టూడెంట్‌గా యూనివర్సిటీని విడిచిపెట్టి ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నారని కొత్త భాష్యం చెప్పారు. శాస్త్రవేత్తలు ప్రపంచాన్ని అధ్యయనం చేస్తే ఇంజినీర్లు నవ ప్రపంచాన్ని సృష్టిస్తారన్నారు. సైన్స్ రంగంలో పీహెచ్‌డీలు పొందిన వారి సంఖ్యలో యూఎస్, చైనా తరువాత మనదేశం మూడవ స్థానంలో నిలిచిందన్నారు. స్టార్టప్‌ల సంఖ్యాపరంగా 3వ స్థానంలో ఉన్నామన్నారు. జీవితంలో గొప్ప సంతృప్తి ఏదైనా ఉంటుందంటే అది సమాజానికి తిరిగి ఇవ్వడం ద్వారానే వస్తుందన్నారు.

విద్యకు అగ్రాసనం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకోసం దాదాపు రూ.30వేల నుంచి రూ.40వేల కోట్ల వరకూ వెచ్చిస్తోందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నామన్నారు. విద్యకు పెట్టినపెట్టుబడి ఎప్పటికీ వృథా కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పద్మశ్రీ గ్రహీత.. శాంత బయోటెక్ అధినేత డాక్టర్ వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ మెట్రో మ్యాన్‌గా పిలిచే శ్రీధరన్, డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి వంటి ప్రముఖులు అభ్యసించిన ఈ కళాశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. యువత ఉద్యోగం కోసమే కాకుండా పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ఆలోచించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలు, పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ వంగా గీత, శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, వర్సిటీ రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, వర్సిటీ డైరెక్టర్లు,టీచింగ్ నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆసీనులైన మంత్రులు దాడిశెట్టి రాజా, విశ్వరూప్ ఎమ్మెల్యేలు కన్నబాబు, దొరబాబు, ద్వారంపూడి

బంగారు పతకాలు

2017-21లో ప్రతిభ చూపిన వారికి గ్రూపుల వారీగా టాపర్స్‌కు, ప్రముఖుల స్మారకార్థం అందజేసే విభాగాల వారీగా 34మందికి, 2018-22 లో ప్రతిభ చూపిన 32 మందికి బంగారు పతకాలతో పాటు 144 మందికి పీహెచ్‌డీలు(డాక్టరేట్‌లు) ప్రదానం చేశారు.

ఇలా మొదలైంది

- ఉదయం 11.40 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆడిటోరియం చేరిక
- 11-42 గంటలకు గ్రూప్ ఫొటో సెషన్
- 11.50 గంటలకు విద్యార్థులతో ప్రతిజ్ఞ
- 12.00 గంటలకు చలమలశెట్టి అనిల్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- 12.01 గంటలకు పీహెచ్‌డీలు, బంగారు పతకాలు ప్రదానం
- 12.15 గంటలకు శాంత బయోటెక్ అధినేత వరప్రసాదరెడ్డి ప్రసంగం
- 12.24 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రసంగం
- 12.35 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం
- 12.53 గంటలకు గవర్నర్‌కు సత్కారం

కాన్వొకేషన్‌లో పట్టాల వివరాలు

డిగ్రీలు	విద్యార్థులు 2017-21	విద్యార్థులు మొత్తం 2018-22
బి.టెక్	60,210	47,385
బి.ఫార్మసీ	2,213	1,622
ఎం.టెక్	1,872	1,663
ఎం.బి.ఎ.	2,248	1,100
ఎం.సి.ఎ.	705	284
ఎం. ఫార్మసీ	441	204
బి.బి.ఎ.	27	6
ఎం.ఎస్.ఐ.టి.	2	0
ఫార్మ డి	256	212
బి.ఆర్కిటెక్చర్	100	24
పీహెచ్.డి.	0	144
గోల్డ్‌మెడల్స్	32	34

ఐటీలో పీహెచ్‌డీ చేస్తా



నాపేరు కె.హేమలిఖిత. సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్ తీసుకోవడం సంతోషంగా ఉంది. సమాచారాన్ని వేగవంతంగా ప్రజలకు అందజేయాలనేది నా ఆశయం. ఈ మేరకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఐటీ రంగంలో పీహెచ్‌డీ చేయాలనుకొంటున్నాను.

\- కె.హేమ లిఖిత, గోల్డ్ మెడలిస్టు

మాటలలో చెప్పలేని సంతోషం



నాపేరు కె.వసుధ. గాయత్రి విద్యాపరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేశాను. స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. కంప్యూటర్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందజేయడమే నా ఆశయం.

\- కె.వసుధ, గోల్డ్ మెడలిస్టు

జగనన్న విద్యాకానుక రెడీ

- జిల్లాలో 1,21,730 మంది విద్యార్థులకు లబ్ధి
- పాఠశాలల ప్రారంభం రోజే అందజేతకు చర్యలు
- నాణ్యతలో రాజీపడకుండా కిట్‌ల రూపకల్పన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్య.. ఇంటికి వెలుగు తెచ్చేది.. భావితరాలకు భవిష్యత్తును ఇచ్చేది. అందరిలో ప్రత్యేకంగా నిలిపేది. అలాంటి చదువు ఎవరికీ భారం కాకూడదనే సదుద్దేశంతో జగనన్న ప్రభుత్వం సకల సదుపాయాలూ కల్పిస్తోంది.. సర్కారు విద్యను పేదింటికి చేర్చింది.. అందరూ బడి బాట పట్టేలా చేసింది. ప్రభుత్వ బడులకు వెళ్లే పిల్లలు ఏ ఒక్క విషయంలోనూ ఇబ్బంది పడకూడదని, ఆ చదువు తల్లిదండ్రులకూ భారం కాకూడదని ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే జగనన్న విద్యా కానుకలు అందిస్తోంది.. ఇదే ప్రథమ కర్తవ్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. జూన్‌లో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం తొలి రోజే పండుగ వాతావరణంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు అందించనుంది. జిల్లాలో మొత్తం 998 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 1,21,730 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ జేవీకే కిట్లు అందించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. పాఠశాలల ప్రారంభం రోజైన జూన్ 12న జేవీకే కిట్లు పంపిణీ చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 19 స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. జగనన్న విద్యా కానుకలైన బ్యాగ్స్, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, షూ, సాక్స్, బెల్ట్, టైలు పెద్ద సంఖ్యలో స్టాక్ పాయింట్లకు వస్తున్నాయి. వాటిని ఒక్కొక్కటిగా కలిపి విద్యార్థులకు ఇచ్చేందుకు వీలుగా కిట్లు తయారు చేస్తున్నారు.




రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ హైస్కూల్‌లో జేవీకే స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

నాణ్యత పరిశీలించాకే..

జేవీకే కిట్లకు సంబంధించి ప్రతి స్టాక్ పాయింట్ వద్ద ఎంఈఓల ఆధ్వర్యంలో నాణ్యత పరిశీలన కమిటీలు ఏర్పాటు చేశారు. వచ్చిన స్టాక్ వివరాలను జిల్లా విద్యాశాఖాధికారులు ఇన్వాయిస్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేస్తున్నారు. ఆయా విద్యార్థులకు సరిపోయేలా షూ.. లోపలి భాగం కొలతలు నిర్దేశించిన విధంగా ఉన్నాయో లేదో చూస్తున్నారు. విద్యాశాఖాధికారులే స్వయంగా కొలతలు, నాణ్యతను తనిఖీ చేస్తున్నారు. నాణ్యతలో ఏమైనా తేడా వస్తే వెంటనే వాటిని మార్పు చేయాలని స్టాక్ పాయింట్స్ వద్ద అధికారులకు సూచిస్తున్నారు. జేవీకే కిట్ విద్యార్థికి వెళ్లిన తర్వాత ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశాలిస్తున్నారు. పాఠ్య పుస్తకాల్లో ముద్రణా లోపాలున్నా, లోపల పేజీలు పాడైనా వాటిని ముందుగానే వేరు చేయాలని స్టాక్ పాయింట్ వద్ద పనిచేస్తున్న సిబ్బందికి వివరిస్తున్నారు.

పూర్తి పారదర్శకతతో..



జగనన్న విద్యా కానుక కిట్‌ల పంపిణీలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టాం. జేవీకే కిట్‌లు పూర్తి నాణ్యతతో వచ్చాయి. ఎక్కడైనా కొన్నింటికి నాణ్యత లోపిస్తే అటువంటి వాటిని పక్కన పెట్టిస్తున్నాం. ఎప్పటికప్పుడు స్టాక్ పాయింట్‌లను పరిశీలిస్తున్నాం. ఆయా స్కూల్ హెచ్ఎంలు జేవీకే కిట్‌ల పంపిణీలో నిబంధనలకు అనుగుణంగా నడుచుకునేలా ఆదేశాలిచ్చాం.

\- ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి, తూర్పుగోదావరి జిల్లా

నేడు రైతు భరోసా సాయం జమ

13,5867 రైతులకు లబ్ధి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అర్హులైన రైతులందరికీ గురువారం వైఎస్సార్ రైతు భరోసా కింద తొలివిడతగాఆర్థిక సాయం విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత చెప్పారు. జిల్లాలో 1,35,867 మంది రైతులకు ఈ పథకం కింద రూ.5,500 చొప్పున రూ.76.26 కోట్లు, పీఎం కిసాన్ యోజన కింద రూ.2,000 చొప్పున రూ.25.61 కోట్లు వెరసి సుమారు రూ.101.91 కోట్లు జమ చేస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద వ్యవసాయ రంగంలోని 577 మందికి రూ.46.83 లక్షలు, ఉద్యాన రైతులకు రూ.55.37 లక్షలు జమ చేస్తామన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి సీఎం జగన్ మోహన్ రెడ్డి ఈ జమ కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. అందులో భాగంగా జిల్లా స్థాయి కార్యక్రమం ధవళేశ్వరం బ్యారేజ్ సమీపంలోని ఎమర్జెన్సీ పునరావా కేంద్ర భవనంలో నిర్వహిస్తున్నామన్నారు. తొలుత ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ఖరీఫ్ సాగుకు నీటి విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, అధికారులు పాల్గొంటారన్నారు.



కలెక్టర్ మాధవీలత

2న వైఎస్సార్ యంత్ర సేవా పథకం మెగామేళా

జూన్ 2న డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం మెగామేళా రెండవ దశ కార్యక్రమాన్ని గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. 166 ట్రాక్టర్లు, రూ.595.78 లక్షల సబ్సిడీతో ఇతర అనుబంధ యూనిట్స్ అందచేస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత వివరించారు.

నేడు డెల్టా కాలువలకు నీరు విడుదల

పశ్చిమ డెల్టాకు 5న విడుదల చేసే అవకాశం

ధవళేశ్వరం: ఖరీఫ్‌కు నీరు విడుదల చేసేందుకు ఇరిగేషన్ యంత్రాంగం సన్నద్ధం అయ్యింది. గురువారం మధ్యాహ్నం గోదావరి తూర్పు,మధ్య డెల్టా కాలువలకు అధికారులు నీరు విడుదల చేయనున్నారు. జిల్లా కలెక్టర్ కె మాధవీలత,ఇరిగేషన్ సీఈ ఆర్ సతీష్‌కుమార్ గేట్ల స్విచ్ ఆన్ చేసి డెల్టాలకు నీరు విడుదల చేస్తారని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి శ్రీనివాస్ తెలిపారు. ఓఅండ్ఎం పనులకు నీరు విడుదల చేసినా ఇబ్బందులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. తూర్పు డెల్టా పరిధిలోని 2,81,303 ఎకరాలు, మధ్య డెల్టా పరిధిలోని 2,01,896ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్‌లో నీరు విడుదల చేయనున్నారు. మరో దక్క పశ్చిమ డెల్టా పరిధిలో ఇంకా నీటి విడుదలపై నిర్ణయం తీసుకోకపోవడంతో గురువారం తూర్పు ,మధ్య డెల్టా కాలువలకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టాకు జూన్ 5వ తేదిన విడుదల చేసే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. ఖరీఫ్‌లో నీటి విడుదలకు ఇబ్బందులు లేకుండా ఇప్పటికే పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. తొలుత డెల్టా కాలువలకు 500క్యూసెక్కుల నీటిని విడుదల చేసి క్రమేపి పెంచనున్నట్లు ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేశారు.

విపత్తుల వేళ ఆపద్బాంధవులు

- జాతీయ విపత్తు నివారణా సంస్థ ముందస్తు చర్యలు
- ప్రకృతి విపత్తుల ప్రభావమున్న గ్రామాల్లో 150 మందికి శిక్షణ

పిఠాపురం: ఆపద వచ్చాక ఆదుకునే కంటే ముందు జాగ్రత్త చర్యల ద్వారా మేలుకోవడం మంచిదని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందుకే జాతీయ విపత్తు నివారణ సంస్థ ద్వారా విపత్తుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్ల తాకిడికి గురయ్యే తీర ప్రాంతాలపై దృష్టి పెట్టింది. జిల్లాలో 20 ముందస్తు హెచ్చరికల కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇవి పక్కాగా పని చేసేలా చర్యలు తీసుకుంటోంది. అధునాతన పరికరాలను అమర్చి సమర్థమంతంగా పని చేయించేలా చూస్తోంది.

కట్టుదిట్టమైన చర్యలు



మండల ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్స్ (ఎంఈఓసీ),మల్టీ పర్పస్ సైక్లోన్ షెల్టర్స్ (ఎంపీసీఎస్)లు సిద్ధం చేశాం. అగ్నిమాపక, పోలీసు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫిషరీష్, మెరైన్ శాఖల అధికారులతో ఆపదమిత్రలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. ఆపద రాక మునుపే వీరు గ్రామాల్లో స్పందించి ప్రజలను అప్రమత్తం చేస్తారు. ఆదుకునేలా సంసిద్ధం చేశాం. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు తగిన సమయంలో హెచ్చరికలు అందేవిధంగా అన్ని చర్యలు తీసుకున్నాం.

\- కిరణ్మయి, జాతీయ విపత్తు నివారణా సంస్థ ప్రాజెక్టు మేనేజర్,



కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముందస్తు హెచ్చరికల కేంద్రం

ముందస్తు హెచ్చరికల కేంద్రాలు

కాకినాడ డివిజన్‌లో గొల్లప్రోలు, పిఠాపురం, యూ కొత్తపల్లి, కాకినాడ రూరల్ కాకినాడ టౌన్, సామర్లకోట, కరప, పెదపూడి, కాజులూరు, తాళ్లరేవు, పెద్దాపురం డివిజన్‌లో కోటనందూరు, తుని, తొండంగి, శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, గండేపల్లి, రౌతులపూడి, కాకినాడ అర్బన్ పరిధిలోని సూర్యారావుపేట, కాకినాడ రూరల్ పగడాలపేట, తూరంగి, కొత్తపల్లి మండలంలో మూలపేట, ఉప్పాడ, ఎండపల్లి, తొండంగి మండలం ఏవీనగరం, ఆవులమంద, లక్ష్మణుడిపేట, పైడికొండ, హంసవరంలలో తహహసీల్దారు కార్యాలయాల వద్ద ముందస్తు హెచ్చరికల కేంద్రాలు ఏర్పాటు చేశారు. యూ కొత్తపల్లి, కాకినాడ అర్బన్, కరప, తాళ్లరేవు, తుని, తొండంగిలలో మండల ఎమర్జెన్సీ ఆపరేటింగ్ సెంటర్లు నెలకొల్పారు. వీటిని గతంలోనే ఏర్పాటు చేసినా నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఆపదమిత్రలకు శిక్షణ

అనుకోకుండా వచ్చే విపత్తుల నుంచి ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు కదిలారు. విపత్తులు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు అధికార యంత్రాంగం చేరుకునేలోగా స్థానికంగా అప్రమత్తం చేసేందుకు 150 మందిని ఆపదమిత్రలను ఎంపిక చేశారు. వారికి ఇటీవల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముందస్తు హెచ్చరికలు చేయడానికి ప్రత్యేక పరికరాలను అందజేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయగానే ప్రజలకు తెలియజేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకుంటారు.

ముందస్తు హెచ్చరికల కేంద్రాలు - 20
మండల ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్స్ (ఎంఈఓసీ) -06
మల్టీ పరపస్ సైక్లోన్ షెల్టర్స్ (ఎంపీసీఎస్)లు -09
ఆపదమిత్రలు - 150 మంది
పరికరాల ఏర్పాటుకు వెచ్చించిన నిధులు - రూ 12 కోట్లకు పైగా



కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల ఎమర్జెన్సీ ఆపరేటింగ్ టవర్

క్లుప్తంగా

తాళాలు పగులగొట్టి చోరీ

కడియం: మండలంలోని దుళ్ళలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుళ్ళ- మురమండ రోడ్డులో బీసీ కాలనీని అనుకుని కొత్తగా ఏర్పడిన శ్రీనివాసనగర్‌లో ఇటుక వ్యాపారం చేసే తూము శ్రీరాములు తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శ్రీరాములు కుటుంబంతో కలిసి ఇటీవల తిరుపతి వెళ్ళారు. బుధవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులకు ఉన్న గడియ విరిగిపోయి ఉంది. లోపలికి వెళ్ళి చూడగా ఇంట్లో బీరువాలోని సుమారు 15 తులాల వెండి వస్తువులు, మూడు గ్రాముల బంగారు వస్తువులు, హాల్‌లోని హోమ్ థియేటర్, సీసీటీవీ హార్డ్ డిస్కులు మాయమైనట్లు గుర్తించారు. దీంతో కడియం పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి బాధితుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా రాత్రి పదకొండు గంటల నుంచి రెండు గంటల మధ్య చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. నిత్యం జనసంచారం ఉండే రోడ్డులో చోరీ జరగడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భర్త, అత్త, మామలకు రిమాండ్

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలకు చెందిన కడిల సత్యవేణి మృతికి కారకులైన ఆమె భర్త కడిల శ్రీశైల మల్లికార్జున, అత్త సూర్యచక్రవర్తి, మామయ్య వెంకటరమణలకు బుధవారం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. సత్యవేణి ఇటీవల భర్త, అత్తమామల వేధింపులు తాళలేక గాడాల పాలచర్ల రోడ్డులో వాటర్ ట్యాంకు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. వారి బంధువుల ఫిర్యాదు మేరకు కోరుకొండ పోలీస్ స్టేషన్ ఎస్సై కట్టా శారదా సతీష్ నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి, వారిపై గృహ హింస, వరకట్న వేధింపులు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపర్చగా నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు.


గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు, మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు


కిస్‌్కంధకాండ


సెల్ఫీ శాటిస్‌ఫ్యాక్షన్


గాల్లో తేలినట్టుందే..


వేదిక ముందు ఉద్విగ్నంగా..

అరుదైన చిత్రపట్టాలు

ప్రముఖుల చేతుల మీదుగా సంప్రదాయ వస్త్రధారణలో పట్టా(ఒరిజినల్ డిగ్రీ) అందుకోవాలన్న వారి కల సాకారమైంది. జేఎన్‌టీయూకే కాన్వొకేషన్ హాలులో బుధవారం కన్నుల పండువగా సాగిన 9వ స్నాతకోత్సవం అందుకు వేదికైంది. తమ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు చూస్తుండగా సగర్వంగా పట్టాలందుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకాలు, పీహెచ్‌డీలు అందుకున్న కొందరు భావోద్వేగానికి గురయ్యారు. అరుదైన ఆ సన్నివేశాన్ని ఫొటోలు, సెల్ఫీల్లో బంధించి మురిసిపోయారు. - బాలాజీచెరువు (కాకినాడ)


గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి గోల్డ్‌మెడల్ అందుకుంటున్న విద్యార్థిని

ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం

రావులపాలెం: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రావులపాలెం కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్(సీఆర్‌సీ)లో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీగా యలమంచిలి శ్రీకాంత్‌లతో కూడిన 11 మంది సభ్యులతో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ నూతన కమిటీ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కబడ్డీ క్రీడాకారులందరికీ అసోసియేషన్ తరపున ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మొట్టమొదటి టోర్నమెంటును వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధాన ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. క్రీడాకారుల వెల్ఫేర్, కోచింగ్ క్యాంప్‌లు, ఎడ్యుకేషన్, జాబ్స్, ప్రో కబడ్డీ అన్నింటికీ అసోసియేషన్ తరపున చేదోడువాదోడుగా ఉంటామని తెలిపారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ మాట్లాడుతూ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మ్యాచులను జూనియర్స్ నెల్లూరులోను, సీనియర్స్ వాడపల్లిలోనూ, సబ్ జూనియర్స్ అవనిగడ్డలోను త్వరలో నిర్వహిస్తామన్నారు. ఏర్పాట్లను సీఆర్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ తేజారెడ్డి, డైరెక్టర్లు చిర్ల కనికిరెడ్డి, కె.సూర్య పర్యవేక్షించారు.

రాష్ట్ర నూతన కమిటీ

అధ్యక్షుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ వెంకటరెడ్డి), జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.వి.ప్రభావతి, జె.ఎస్.వి ప్రసాదరెడ్డి, ట్రెజరర్‌గా ఎం.సుబ్బరాజు, జాయింట్ సెక్రటరీలుగా వి.కృష్ణ, ఎస్.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా యలమరెడ్డి శ్రీకాంత్, ఓ.రవీంద్రరెడ్డి, టి.మమత, ఎం.సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైభవంగా తలుపులమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

- రూ.పది కోట్లతో జీర్ణోద్ధరణ పనులు
- భక్తులకు సంపూర్ణ సౌకర్యాలు కల్పిస్తామన్న మంత్రులు


పునఃప్రతిష్ఠా మహోత్సవాల్లో పాల్గొన్న మంత్రులు సత్యనారాయణ, రాజా, ఎంపీ గీత

తుని రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. బుధవారం ఉదయం 8.16 గంటలకు తలుపులమ్మ అమ్మవారి జీర్ణోద్ధరణ పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత నిర్వహించారు. మంత్రులకు వేద పండితులు, రుత్వికులు ఆశీస్సులు అందజేశారు. కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు, చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు మంత్రులను అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటాలతో సత్కరించారు. పునఃప్రతిష్ఠా మహోత్సవాలను పురస్కరించుకుని వేదపండితులు, రుత్వికులు, ప్రధాన అర్చకులు వివిధ పూజలు చేశారు. గోదర్శనం, మహాపూర్ణాహుతి, దీక్షా విమోచనము, నీరాజన మంత్రపుష్పములు, ఆశీర్వచనములు నిర్వహించారు. సర్పంచ్ బుద్దాల సత్తిబాబు ఆధ్వర్యంలో రాజుపేట నుంచి వందలాది మంది మహిళలు ఊరేగింపుగా వచ్చి చీర, సారె అమ్మవారికి సమర్పించారు. అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్, తుని మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వి.కొత్తూరు, లోవకొత్తూరు సర్పంచ్‌లు దుంగల గణపతి రోజమణి, లంక వెంకటలక్ష్మి, దేవస్థానం మాజీ చైర్మన్లు బొంగు ఉమారావు, దూలం మాణిక్యం, లాలం బాబ్జి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, నాయకులు దుంగల నాగేశ్వరరావు, లంక కృపానందం, పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా..

తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానాన్ని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని, సంపూర్ణ సౌకర్యాలతో భక్తులకు సులభంగా అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. జీర్ణోద్ధరణ పునఃప్రతిష్ఠా మహోత్సవాల్లో పాల్గొన్న మంత్రులు సత్యనారాయణ, రాజా విలేకర్లతో మాట్లాడారు. వృద్ధులు, చిన్నారులు, భక్తులకు ఇబ్బందులు లేకుండా అమ్మవారి చెంతకు చేర్చేందుకు మూడు ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అమ్మవారి అనుగ్రహం, ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత బలోపేతమై ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. ఆలయం పునర్నిర్మించాలని భావించి బాలాలయం నిర్మించగా అక్కడ పుట్టధార (జలధార) ఉబికి వచ్చిందని, దాంతో పునర్నిర్మాణానికి అమ్మవారే అంగీకారం తెలిపినట్టు భావించామని మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. దాంతో ఇంతటి బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. రూ.పది కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను, ప్రణాళిక ప్రతులను మంత్రులు పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జూలైలో ఇంటింటికీ బీజేపీ

పార్టీ జాతీయ కార్యదర్శి, ఏపీ సహ ఇన్‌చార్జ్ సునీల్ దేవదర్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జూలై నెలలో రాష్ట్రంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తామని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, ఏపీ సహ ఇన్‌చార్జ్ సునీల్ దేవదర్ అన్నారు. కాకినాడలో బుధవారం ఆయన ఒక హోటల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. గడిచిన తొమ్మిదేళ్లుగా దేశం అన్ని రంగాల్లోను ముందు ఉన్నదంటే దానికి కారణం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని చెప్పారు. తొమ్మిదేళ్ల పాలనలో మోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించేందుకు కేంద్ర మంత్రులు, పార్టీ కార్యవర్గ సభ్యులు ప్రతీ పార్లమెంట్ జిల్లాలోను పర్యటిస్తారన్నారు. దీని కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. 2024తో ఏపీలో బీజేపీ విజయ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ప్రతీ జిల్లాలోను వెయ్యి మందితో భారీ బహిరంగ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో వరల్డ్ ఎకనామిలో భారత్ 10 స్థానంలో ఉండగా ప్రస్తుతం 5వ స్థానంలో ఉందన్నారు. కరోనా సమయంలో వంద దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో దేశంలోని 80 కోట్ల మంది నిరుపేదలకు ఉచితంగా రేషన్ అందించారన్నారు. 9.6 కోట్ల మంది గృహిణులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందించారన్నారు. 12 కోట్ల మందికి మంచినీటి సదుపాయం, 11. 72 కోట్ల మరుగుదొడ్లు నిర్మించారన్నారు. దేశంలో 9,300 జన ఔషధ కేంద్రాలు, 3.5 కోట్ల పక్కా గృహాలు నిర్మించామన్నారు. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు పెట్టిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, మాలకొండయ్య, రవికిరణ్, ముత్తా నవీన్, కవికొండల భీమశంకర్, రంభాల వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవదర్

పథకం ప్రకారమే హిజ్రా హత్య

- తప్పుడు ప్రచారం చేస్తుందన్న అక్కసుతోనే ఘాతుకం
- పాత నేరస్తులు ముగ్గురూ అరెస్ట్
- బటన్ నైఫ్, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ ఖాదర్ బాషా



హిజ్రా ఆనంది హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం టౌన్: తోటి స్నేహితుడి క్యారెక్టర్‌పై తప్పుడు ప్రచారం చేస్తోందనే అక్కసుతో ధవళేశ్వరానికి చెందిన హిజ్రా మరపట్ల ఆనంద్ అనే ఆనందినిని తన ముగ్గురు స్నేహితులే అతి కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈనెల 12వ రాత్రి సమయంలో ఆలమూరు మండలం జొన్నాడ గ్రామ శివారు ఎన్‌హెచ్ 216ఎ రహదారిని ఆనుకుని ఉన్న పంట కాల్వ బోదెలో హిజ్రా ఆనందిని గుర్తు తెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో పీక, మెడ కోసి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఆనందిని హత్య చేసిన ముగ్గురు స్నేహితులు ధవళేశ్వరానికి చెందిన కేతా భరత్ వెంకట సుధీర్ అనే పెద్ద కేతా, బొమ్మూరుకు చెందిన వీలు కళ్యాణ్ అనే పెద్ద కల్లి, ధవళేశ్వరానికి చెందిన సింగంపల్లి కార్తికేయ అనే సోనూలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని ధవళేశ్వరంలోని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పాత క్వార్టర్స్ వద్ద మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే ఓ హత్య కేసులో నిందితుడైన పెద్ద కేతా రౌడీషీటర్ కూడా. పెద్ద కల్లి కూడా రౌడీ షీటరే. పెద్దకల్లి, సోనూలపై గతంలో హత్యాయత్నం కేసులు ఉన్నాయి. ఇలా పాత నేరస్తులైన ఆ ముగ్గురూ హిజ్రా ఆనందిని పథకం ప్రకారం హతమార్చారు. ఈ హత్య కేసుకు సంబంధించిన వివరాలను అమలాపురం ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా వెల్లడించారు. ఏఎస్పీ ఖాదర్ రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, క్రైమ్ సీఐ డి.గోవిందరావులతో కలిసి ఎస్పీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితుల నేర చరిత్రను చెప్పారు.

ఆనందిని చేస్తున్న తప్పుడు ప్రచారం సహించలేకే...

నిందితుల్లో ఒకడైన సోనూ మేనత్త హిజ్రా. ఆమెకు స్నేహితురాలు హిజ్రా ఆనందిని. అలా సోనూకు పరిచయమైన ఆనందిని తర్వాత పెద్ద కేతా, పెద్ద కల్లితో కూడా స్నేహం ఏర్పడింది. అలా సాగిపోతున్న వీరి స్నేహంలో హిజ్రా ఆనందిని తన క్యారెక్టర్‌కు సంబంధించి తప్పుడు ప్రచారం చేస్తుండడంపై పెద్ద కేతా సహించలేకపోయాడు. ఇదే విషయాన్ని తన స్నేహితులతో చెప్పి ఆనందిని హత్యకు పథకం పన్నారు.

మద్యం సేవించి ఆపై హత్య

ఆ రోజు రాత్రి హిజ్రా ఆనందిని వేమగిరి సెంటరులో పెద్ద కేతా, సోనూలు తమ మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని జొన్నాడ సెంటరుకు చేరుకున్నారు. తర్వాత మద్యం కొనుక్కుని జొన్నాడ శివారు పంట బోదె వద్దకు చేరుకున్నారు. అక్కడ అందరూ మద్యం సేవించారు. వారి మరో స్నేహితుడు పెద్ద కల్లికి ఫోన్ చేసి అతడిని కూడా అక్కడికి రప్పించారు. వారితో పాటు పెద్ద కల్లి కూడా మద్యం సేవించాడు. హత్యా పథకంలో భాగంగా తొలుత పెద్ద కేతా తన వద్ద ఉన్న బటన్ నైఫ్‌తో ఆనంది నడుంపై పొడిచాడు. సోనూ హిజ్రా ఆనందిని కాళ్లు పట్టుకోగా పెద్ద కేతా వద్ద ఉన్న నైఫ్‌ను పెద్ద కల్లి లాక్కుని ఆమె మెడ వెనుక కుడి ఎడమ భాగాల్లో కోసివేశాడు. సోనూ బీరు బాటిల్‌తో ఆనందిని తలపై కొట్టడంతో చనిపోయిందనుకుని పక్కనే ఉన్న పంట బోదెలోకి నెట్టేశారు. అప్పటికీ ఆనందిని కొన ఊపిరితో కదలడాన్ని గమనించిన పెద్ద కల్లి ఇది బతికితే మనకు ఇబ్బందవుతుందనే ఉద్దేశంతో బటన్ నైఫ్‌తో పీకను కసితీరా కోసేసి చంపేశాడు. ఆనందిని చనిపోయిందని నిర్ధారించుకుని ఆ ముగ్గురూ అక్కడ నుంచి పరారయ్యారు.

సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు

జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాలతో కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ రజనీకుమార్, ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ అన్ని కోణాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేసి ముగ్గురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలను సేకరించి అరెస్టులు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన బటన్ నైఫ్, రెండు మోటారు సైకిళ్లు, రూ.800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేవలం 18 రోజుల్లో హత్య కేసును ఛేదించిన కొత్తపేట డీఎస్పీ, రావులపాలెం సీఐ, ఆలమూరు ఎస్సైలను ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా అభినందించారు.

బాకీ అడిగినందుకు చంపేశారు

- ధాన్యం కమీషన్ వ్యాపారి అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ
- రూ. 80 వేలు అప్పు తీసుకున్న వారే పథకం ప్రకారం హత్య
- గొయ్యి తీసి పూడ్చిపెట్టిన వైనం


మృతుడు వెంకటరామారెడ్డి (ఫైల్)

మండపేట: అవసరానికి రూ.80 వేలు ఇచ్చి ఆదుకున్న వ్యాపారి.. తిరిగి తన బాకీ చెల్లించమని కోరినందుకు అతనిపై ఆ అన్నదమ్ములిద్దరూ కక్ష పెంచుకున్నారు. డబ్బులిచ్చేస్తామని మకాం వద్దకు రప్పించి ఆయన్ను అంతమొందించారు. ముందుగానే తీసిన గోతిలో నిలువునా పూడ్చిపెట్టారు. మండపేటలో ఈ నెల 25న అదృశ్యమైన ధాన్యం కమీషన్ వ్యాపారి గొలుగూరి కోదండ వెంకట రామారెడ్డి (44) కేసు చివరకు విషాదాంతమైంది. ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. పట్టణంలో సంచలనం కలిగించిన ఈ ఘటనకు సంబంధించి రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, మృతుని బావ మల్లిడి శ్రీనివాసరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలివీ..

స్థానిక నారాయణ స్కూల్ సమీపంలో నివసించే రామారెడ్డికి తన ఇంటికి కూతవేటు దూరంలో నివాస స్థలం ఉంది. ప్రతీ రోజు ఉదయం అక్కడ వాకింగ్‌కు వెళుతుండేవారు. పక్క స్థలంలో వీరభద్రపురానికు చెందిన అన్నదమ్ములు రావూరి సూర్యారావు, ఏసురాజులు పశువుల మకాం నిర్వహిస్తుండేవారు. వీరి వద్ద నుంచి పాలు కొనుగోలు చేసే క్రమంలో రామారెడ్డికి వారితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో డెయిరీ కోసమని రూ.50 వేలు అప్పు తీసుకుని తిరిగి చెల్లించేశారు. ఏడాది క్రితం మళ్లీ రూ.80 వేలు అప్పుగా తీసుకున్నారు. మకాంలోని గేదెలను అమ్మేస్తుండటంతో కొద్ది రోజులుగా తన బాకీ చెల్లించమని రామారెడ్డి వారిని కోరుతున్నాడు. దీనిని అవమానంగా భావించిన వారు ఆయన్ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. తమ మకాంలో ఎనిమిది అడుగుల లోతున నిలువుగా గోతిని తవ్వి ఎవరికీ అనుమానం రాకుండా దానిపై తాటాకులు, గడ్డి కప్పి ఉంచారు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్న సమయంలో బాకీ చెల్లిస్తామని, తాము రాసిన నోటు తీసుకురమ్మని బయటి వ్యక్తి ఫోన్ నుంచి రామారెడ్డికి ఫోన్ చేశారు. నిజమని నమ్మి రామారెడ్డి ఇంట్లో భార్యకు చెప్పి మకాం వద్దకు వచ్చాడు. ఆయన్ను జాగ్రత్తగా గోతి వద్దకు రప్పించి ఒక్కసారిగా గోతిలో పడేసి రాళ్లతో కొట్టి హత్యచేశారు. అతని మెడలో ఉన్న గొలుసును తీసుకుని మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. రాత్రి అయినా తన భర్త ఇంటికి తిరిగిరాకపోవడంతో రామారెడ్డి భార్య శ్వేతనాగదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామారెడ్డి కాల్‌డేటా, భార్య ఇచ్చిన వివరాలతో సీఐ పి.శివగణేష్, ఎస్ఐ ఎం.అశోక్, ఐడీ పార్టీ కేసు దర్యాప్తు చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పరారీలో ఉన్న సూర్యారావును అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగుచూసింది. విచారణలో సూర్యారావు కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడంతో పూర్తి ఆధారాల సేకరణకు పోలీసులకు కొంత సమయం పట్టింది. రామారెడ్డి మెడలోని గొలుసును రూ.లక్షకు తాకట్టు పెట్టి ఒక సెల్‌ఫోన్ కొని మిగిలిన సొమ్ముతో జల్సాలు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఫొరెన్సిక్ అధికారుల సమక్షంలో మకాం వద్ద పూడ్చిపెట్టిన గోతి నుంచి మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామా చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడు ఏసురాజు కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసును తాము ప్రత్యేకంగా భావిస్తూ నాలుగైదు నెలల్లోనే ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులకు శిక్ష పడే విధంగా కృషిచేస్తామని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ మృతుని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.


మృతదేహాన్ని బయటకు తీసేందుకు గోతిని తవ్వుతున్న సిబ్బంది

శోక సంద్రంలో రామారెడ్డి కుటుంబం

రామారెడ్డి మృతితో అతని కుటుంబ శోకసంద్రంలో మునిగిపోయింది. తన భర్త క్షేమంగా తిరిగివస్తాడని వారం రోజులుగా వెయి కళ్లతో ఎదురుచూస్తున్న భార్య నాగదేవి, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సౌమ్యునిగా మంచి పేరున్న రామారెడ్డి దారుణహత్యకు గురికావడం అందరినీ కలచివేసింది. ఆయన్ను చివరిసారి చూసేందుకు తోటి వ్యాపారులు, అనపర్తి మండలం రామవరం, పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన సన్నిహితులు, బంధువులతో సంఘటన స్థలం హృదయవిదారకంగా మారింది. రూ.80 వేలు బాకీ కోసం హత్య చేశారన్న వార్త పట్టణంలో సంచలనంగా కలిగించింది.